జిల్లాలో రూ. 18.43 కోట్లతో పనుల జాతర

● 22 నుంచి ప్రారంభం

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 22వ తేదీ నుంచి చేపడుతున్న పనుల జాతర 2025ను జిల్లాలో కూడా ఆరంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. స్వచ్ఛభారత్ మిషన్, ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటి సరఫరాశాఖ ద్వారా చేపట్టబోయే కొత్త పనులను జిల్లాలో ప్రారంభించడానికి పనుల జాతర 2025 అనే వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నది. ఈ పనుల జాతరలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 2199 కోట్ల రూపాయల అంచనాలతో పనులను ప్రతిపాదించారు.

అందులో భాగంగా జిల్లాలో 260 పశువుల పాకలు, 26 గొర్రెల షెడ్లు, 65కోళ్ల ఫారాలు, 13 పాఠశాల మరుగుదొడ్లు, 130 వర్మీ కంపోస్టు గుంతలు, 13చెక్ డ్యాంలు, 1300 వ్యక్తిగత ఇంకుడు గుంతలు, 65 అజోల సాగు, 2 సెగ్రిగేషన్ షెడ్లు, 2 ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్లు, 2 కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సులు, 27 అంగన్‌వాడీ భవనాలు, 35 గ్రామపంచాయతీ భవనాలు మొత్తం 1940 పనులను 18 కోట్ల 43 లక్షల 24 వేల రూపాయలతో చేపట్టేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనులను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని కలెక్టర్ పేర్కొన్నారు.

● టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిన మత్స్య శాఖ
● సెప్టెంబర్ 1 వరకు గడువు, అదే రోజు టెండర్లు ఖరారు
● జిల్లాలో 158.82 లక్షల చేప పిల్లల పంపిణీకి కసరత్తు

చేపల పంపిణీకి లైన్ క్లియర్





(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మత్స్యకారులకు ఉచిత చేప పిల్లల పంపిణీపై నెలకొన్న అనుమానాలకు తెర పడింది. ఆలస్యంగా నైనా మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు జిల్లాల వారీగా కావాల్సిన చేప పిల్లల కోసం జిల్లా మత్స్య శాఖాధికారులు ఈ నెల 18వ తేదీన అర్హులైన కాంట్రాక్టర్ల నుంచి టెండర్లను ఆహ్వానించింది. సెప్టెంబరు 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్లు దాఖలు చేసేందుకు గడువు విధించింది. అదే రోజు టెండర్లను ఓపెన్ చేసి ఖరారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాలోని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా డిమాండ్ ఉన్న రోహు, బొచ్చ, బంగారు తీగ రకాల చేప పిల్లలను పెంచనున్నారు. జిల్లాలో అనేక మంది మత్స్యకారులు చేప పిల్లల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు.

● జిల్లాలో 145 మత్స్యకారుల సహకార సంఘాలు

జిల్లాలో 145 మత్స్యకారుల సహకార సంఘాలు ఉండగా, వీటిలో 11,397 మంది మత్స్యకారులు ఉన్నారు. 38 మహిళా మత్స్యకార సహకార సంఘాలు ఉండగా, వీటిలో 1899 మంది సభ్యులు ఉన్నారు. అలాగే 15 మత్స్యకారుల లైసెన్స్ హోల్డర్ మార్కెటింగ్ సొసైటీలు ఉండగా, ఇందులో 660 మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలో పెద్ద చెరువులు, చిన్న చెరువుల్లో చేపలు పెంచుకునేందుకు మత్స్యకారులకు ప్రతి ఐదేళ్లకోసారి ప్రభుత్వం లీజుకు ఇస్తున్నది. తద్వారా ప్రభుత్వానికి 11 లక్షల 56 వేల 646 రూపాయల లీజు వస్తున్నది. ఈ ఏడాది జిల్లాలో గల 1,076 చెరువులు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో చేప పిల్లల ఉత్పత్తి కోసం మత్స్యకా రులకు మొత్తం ఒక కోటి 58 లక్షల 82 వేల చేప పిల్లలు మత్స్యకారుల ద్వారా పెంచాలని నిర్ణయించారు. 85 నుంచి 100 ఎంఎం సైజు గలవి 56 లక్షల 80 వేల చేప పిల్లలు, 35 నుంచి 40 ఎంఎం సైజు గలవి కోటి 2 లక్షల 2 వేల చేప పిల్లల కోసం టెండర్లు పిలిచారు. పెద్దవి లక్ష చేప పిల్లలకు 1,66,130 రూపాయలు, చిన్నవి లక్ష చేప పిల్లలకు 62,670 రూపాయల ధర నిర్ణయించారు.

● పదేళ్లుగా ఉచితంగా చేప పిల్లల పంపిణీ

మత్స్యకారులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015 నుంచి ఉచితంగా చేప పిల్లల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అంతేగాకుండా గతంలో చెరువులు, కుంటలను లీజుకు ఇచ్చి ప్రతి ఏటా మత్స్యకార సహకార సంఘాల నుంచి డబ్బులు వసూలు చేసే వారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఐదేళ్లకోసారి మాత్రమే లీజు డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించి వసూలు చేసింది. మొదట

(మిగతా 8వ పేజీలో)

ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారణకు ఆదేశం

ఓదెల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్కపల్లిలో గల సర్వే నెంబర్ 666లోని గ్రామ పంచాయతీ భూమి ఆక్రమణపై డీఎల్‌పీవో విచారణకు ఆదేశించారు. గ్రామ పంచాయతీ భూ ఆక్రమణకు గురైందని, భూమిని కాపాడాలని గత సోమవారం ఇదే గ్రామానికి చెందిన శనిగరపు రమేష్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేస్తూ ఏడు రోజుల్లో విచారణ నివేదికలను సమర్పించాలని ఎంపీవోను ఆదేశించారు.

స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాలి

● డీఎల్‌పీవో వేణుగోపాల్



బ్రాహ్మణపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛత, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లిలో డీఎల్‌పీవో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి అనంతరం గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య నిర్వహణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు, దోమల నివారణకు గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న పనులను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ ఉన్నారు.

బయో మెడికల్ వేస్ట్‌ను బయట వేస్తే చర్యలు

కోల్‌సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల నుంచి వెలువడే బయోమెడికకల్ వేస్టును చెత్తకుండీల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆసుపత్రులకు జరిమానాలు విధించామని కమిషనర్ అరుణశ్రీ పేర్కొన్నారు. హానికరమైన బయోమెడికల్ వేస్ట్‌ను నగరపాలక సిబ్బంది తొలగించరాదని, కార్పొరేషన్ వాహనాల్లో తరలించవద్దన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారికంగా గుర్తించిన ఏజెన్సీ వాహనాలకే బయో మెడికల్ వేస్ట్ అప్పగించాలని ఆమె సూచించారు.

ఎన్టీపీసీలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

జ్యోతినగర్, ఆ గస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 22, 23లలో ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జెడ్పీ స్కూల్ మైదానంలో రామగుండం పశ్చిమ మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జింక మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. 22న బాలికల అండర్ 14, అండర్ 17 వాలీబాల్, కబడ్డీ, కోకోతోపాటు అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న బాలురకు వాలీబాల్, కబడ్డీ, కోకో, అథ్లెటిక్స్ పోటీలను జరుగుతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ ప్రధానోపాధ్యుడి నుంచి ఎస్‌జీఎఫ్ ధృవీకరణ పత్రం తీసుకొని రావాలని సూచించారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు సంబంధించి మరింత సమాచారం కోసం రామగుండం జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కమార్(9849218365), ఎన్టీపీసీ జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ ఎం.డి.జావేద్(9177885183)లను సంప్రదించాలని ఎంఈవో కోరారు.

టీబీజీకేఎస్‌కు కోశాధికారి రాజీనామా

● త్వరలోనే జాగృతి నుంచి బాయిబాట



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్ వెంకటేష్

గోదావరిఖని, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘానికి సంఘం కోశాధికారి ఎల్ వెంకటేష్ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. స్థానికంగా బుధవారం మీడియాతో మాట్లాడిన వెంకటేష్ టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా పది సంవత్సరాల పాటు పని చేసిన కవితను కాదని జనరల్ బాడీ సమావేశంలో గౌరవ అధ్యక్షురాలిని మార్పు చేయడం అప్రజాస్వామికమన్నారు. కవిత గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కారణంగానే వారసత్వ ఉద్యోగాలు కారుణ్య నియామకాలుగా మారిందని, 19463మందికి డిపెండెంట్ ఉద్యోగాలు దక్కాయని వెంకటేష్ చెప్పారు. తెలంగాణ ఇంక్రిమెంట్, రూ.10 లక్షల వడ్డీ లేని రుణం, ఉచిత కరెంటుతో ఏసీ సౌకర్యం, అంబేద్కర్ జయంతి సెలవు దినం లాంటి హక్కులను సాధించ గలిగామన్నారు. కార్మికుల తల్లిదండ్రులకు ఉచిత కార్పొరేట్ వైద్యం రూ.25లక్షలకు పెంచడం కూడా కవిత వల్లే జరిగిందని వెంకటేష్ చెప్పారు. కవిత ఆధ్వర్యంలో త్వరలో బాయిబాట కార్యక్రమం చేపడుతామని వెంకటేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు రాకేష్, అనీల్, హరీష్, మనోజ్, హరి, రవి, శ్రీకాంత్‌రెడ్డి, విష్ణు, గణేష్ ఉన్నారు.

బీఆర్ఎస్ హయాంలో పంటలు నష్టపోయిన రైతులు

మంథని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంత రైతులు బ్యారేజీల బ్యాక్‌వాటర్ కారణంగా పంటలు మునిగి తీవ్రంగా నష్టపోయారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, తెలంగాణ విద్యుత్ నియంత్రణ సలహా కమిటీ సభ్యుడు శశిభూషన్‌కాచే, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాంత ఇసుకను దోచుకొని ప్రభుత్వాన్ని నడిపిందన్నారు. ఈ ప్రాంత విద్యార్థుల కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పలు కాలేజీలు ఏర్పాటుతో మందుకు సాగుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

భార్యాపిల్లల బాగోగులు చూడని ఉద్యోగి సస్పెన్షన్ 6

- ఉత్తర్వులు జారీ చేసిన పెద్దపల్లి కలెక్టర్

ఐటీఐ కొత్త కోర్సులతో విద్యార్థులకు ఉద్యోగాలు 7

- హైదరాబాద్‌కు వెళ్లిన విద్యార్థులు

దోమల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్య శాఖ అధికారులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) వరల్డ్ మస్కిటో డే సందర్భంగా స్థానిక బస్టాండ్ ఆవరణలో బుధవారం దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన, ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి అన్న ప్రసన్న కుమారి మాట్లాడుతూ దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని, వ్యక్తిగత జాగ్రత్తలు: దోమలు కుట్టకుండా శరీర భాగాలను పూర్తిగా కప్పి ఉంచే దుస్తులను వాడాలని, ఇంటి కిటికీలకు ద్వారాలకు దోమతెరలను (మెష్) వాడాలని సూచించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి ముఖ్యంగా కొబ్బరి చిప్పలు ఖాళీ టైర్లు సీసాలు , రోల్లు మొదలగువు వాటిలలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. నీటి గుంటలు ఉన్నచో పూడ్చి వేయాలని, పూడ్చలేని నీటి గుంటలలో ఆయిల్ బాల్స్ వేయాలని, వ్యక్తిగత దోమల నివారణ చర్యలు చేపడుతూ జ్వరం వచ్చిన యెడల వారి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. శ్రీరాములు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉమామహేశ్వర్, సబ్ యూనిట్ ఆఫీసర్లు రవీందర్, అంజయ్య తదితర వైద్య సిబ్బంది రాజబాబు, అఫ్రోజ్, రాకేష్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

● లయన్స్ క్లబ్ గవర్నర్ కోదండరాం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడంలో రామగుండం లయన్స్‌క్లబ్ ముందుంటుందని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కోదండరాం అన్నారు. బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్‌లో 35మందికి కృత్రిమ అవయవాలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఐడీ కార్డులు, మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ అంకిత భావంతో పని చేస్తుందని, ప్రమాదంలో అంగవికలాంగులైన పేద వారికి ఉచితంగా అవయవాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సారయ్య, మల్లికార్జున్, రాజేందర్‌కుమార్, ప్రమోద్‌కుమార్, కంజాపురం రాజేందర్, గంగాధర్, తిలక్ చక్రవర్తి, లక్ష్మారెడ్డి, తానిపర్తి విజయలక్ష్మి, రంగమ్మ, కౌసల్య పాల్గొన్నారు.



వికలాంగురాలికి కృత్రిమ అవయవం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

రైతులకు సరిపడా యూరియా నిల్వలు

ఓదెల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరికీ సరిపోయే యూరియా బస్తాలు ఉన్నాయని, కొరత ఉన్నాయని వచ్చే వదంతులను రైతులు నమ్మవద్దని ఏవో భాస్కర్ తెలిపారు. పొత్కపల్లి ప్యాక్స్ కేంద్రంలో బుధవారం సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డితో కలిసి ఏవో భాస్కర్ యూరియా బస్తాల పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ వానాకాలం సీజన్ వరకు సుమారుగా 1700 మెట్రిక్ టన్నుల యూరియా (సుమారుగా 38 వేల యూరియా బస్తాలు) సరఫరా చేశామని తెలిపారు. ప్రతి రోజు ప్రభుత్వ, ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరియా స్టాక్ వస్తుందని తెలిపారు. ఇంకా ఓదెల మండలానికి రావాల్సిన స్టాక్ విడతలవారీగా వస్తుందని తెలిపారు. మండలంలోని పొత్కపల్లి ప్యాక్స్, కొలనూర్, గుంపుల,గూడెం,ఓదెల, పిట్టల ఎల్లయ్యపల్లి గ్రామాల్లోని ప్రైవేటు దుకాణాల్లో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు సోదరులు, అవసర మేరకు యూరియా బస్తాలు తీసుకోవాలని సూచించారు. కొందరు రైతులను అయోమయానికి గురిచేస్తున్నారని, ఆధారాలు లేని అసత్య ప్రచారాలపై అధికారులు దృష్టి పెడుతున్నారని తెలిపారు. బుధవారం పొత్కపల్లి ప్యాక్స్‌లో 1,334 బస్తాలు రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. రైతులు మూడవ దఫా నానో యూరియా రూపంలో పిచికారి చేసుకోవాలని అన్నారు. మోతాదుకి మించి యూరియా వాడకం వలన చీడ, పీడలు పెరిగి, పంట దిగుబడి తగ్గుతుందన్నారు. భూ సారం దెబ్బతిని పంటలు పండవని తెలిపారు.



పొత్కపల్లి ప్యాక్స్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఏవో భాస్కర్

సుల్తానాబాద్‌లో పుస్తక ప్రదర్శన

సుల్తానాబాద్, ఆగస్టు 24: (ఆంధ్రజ్యోతి): నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ప్రారంభించారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. బుక్ హౌస్ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి పురుషోత్తం సతీష్ మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శనలో పది శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని ఈ అవకాశాన్ని పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ పుస్తక ప్రదర్శన కేంద్రాన్ని పలు రాజకీయ పార్టీల నేతలు ప్రజా ప్రతినిధిలు, అధికారులు సందర్శించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలి

● ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు
● కలెక్టర్ కోయ శ్రీ హర్ష

సుల్తానాబాద్, ఆగస్టు 20: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాలను ఎరువుల గోదాములను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లతో ఆస్పత్రిలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో మరింత మెరుగైన వైద్య సేవలందించేందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి సమీక్షించారు. ముఖ్యంగా ఈ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రజలకు అవగాహణ కల్పించాలని సూచించారు. రాత్రి వేళల్లో ఆసుపత్రి ఆవరణలో చుట్టు విద్యుత్ దీపాలు ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. రూ 12 లక్షల యాభై వేల రూపాయలతో నూతనంగా కొనుగోలు చేసిన అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎన్ఎస్టి యంత్రాలను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రారంభించారు.

కలెక్టర్ వెంట జిల్లా కేంద్ర ఆసుప త్రి సూపరింటెండ్ డాక్టర్ శ్రీధర్, సుల్తానాబాద్ ఆస్పత్రి సూప రింటెండ్ డాక్టర్ రమాదేవి, మున్సిపల్ కమీషనర్ రమేష్ తదితరులు ఉన్నారు.



సుల్తానాబాద్ ఆస్పత్రిలో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్



సుల్తానాబాద్ సొసైటీలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● రైతులకు సరిపడా ఎరువులు

రైతుల పంటల సాగుకు సరిపడా ఎరువుల నిల్వలు అందు బాటులో ఉన్నాయని ముఖ్యంగా యూరియా నిలువలు కూడా గోదాముల్లో ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ అన్నారు. స్థానిక సహకార సంఘం కార్యాలయాన్ని, ఎరువుల గోదాములను విక్రయాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా ఎక్కడా కొరత లేదని, రైతులు సాగు చేసిన పంటల విస్తీర్ణం ఆధారంగా ఎరువులు విక్రయించాలని ప్రస్తుత అవసరాలకు తగినంతగానే రైతులు కొనుగోలు చేసుకోవాలన్నారు. సొసైటీ ఎరువుల విక్రయాల రిజిష్టర్లను తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి నాగార్జున, సొసైటీ సీఈఓ బూరుగు సంతోష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆధార్ సవరణ క్యాంపులు

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు మండలాల్లో ఆధార్ సవరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక పకటనలో తెలిపారు. ప్రతి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాలు, పెద్దపల్లి, రామగుండం పట్టణాలల్లోని మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేశామని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆధార్ వివరాలను సరిచేసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రం లబ్ధిదారులు ఆధార్ వివరాలు అప్డేట్ చేసుకుని, పోషణ్ ట్రాకర్ ఎఫ్ఆర్ఎస్ వందశాతం నమోదు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు

కిడ్నాప్ అయిన వృద్ధురాలి హత్య


పెగుడ మల్లవ్వ(ఫైల్)

గంగాధర/గంభీరావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కిడ్నాపైన గంగాధర మండల కేంద్రానికి చెందిన పెగుడమల్లవ్వ(70)ను దుండగులు హత్య చేశారు. ఎస్సై వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల16న మల్లవ్వను ఇంటి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. మరుసటి రోజున మల్లవ్వ తమ్ముడు ఈరవేణి రాయమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్‌కు చెందిన గంగరాజు మల్లవ్వను కిడ్నాప్ చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా కొత్తపల్లి మండలం మల్కాపూర్‌కు చెందిన దేవునూరి సతీష్, దేవునూరి శ్రావణ్ గంగరాజు సూచనల మేరకు ఈనెల 16న మల్లవ్వను కారులో ఎక్కించుకుని కిడ్నాప్‌చేశారు. మల్లవ్వను గంభీరావుపేట మండలశివారులోని పెద్దమ్మ స్టేజివద్ద అడవిలో హత్యచేసి ఆమె పైన ఉన్న బంగారు ఆభరణాలు, నగదును దోచుకుని మృతదేహాన్ని చెత్త కుప్పలో పడేశారు. మల్లవ్వను కిడ్నాప్ చేసే సమయంలో కారు నంబర్‌కనిపించకుండా స్టిక్కర్లు అతికించి దుండగులు జాగ్రత్తపడ్డారు. నిందితుల సెల్‌ఫోన్‌లను ట్రాప్‌చేసి పట్టుకోగా హత్యానేరాన్ని ఒప్పుకున్నారు. హత్యకు సంబంధించి ప్రధాన నిందితుడైన గంగరాజుతోపాటు మరికొందరు పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు వేవునూరి శ్రావణ్‌పై గతంలో కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో గంజాయి, కొట్లాట కేసులు ఉన్నాయి. ఇద్దరు నిందితుల వద్ద నుంచి రెండుసెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమా వేశంలో కరీంనగర్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, ఎస్సై వంశీకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్‌పత్తి ధరరూ.7600 పలికింది. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు 18క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

మహారాష్ట్ర వరదలో చిక్కుకున్న గోదావరిఖని వాసులు

కోల్‌సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనికిచెందిన మామిడి కుమార్ కుటుంబం మహారాష్ట్ర వరదల్లో చిక్కుకుంది. మందమర్రి, మంచిర్యాలకు చెందిన నలుగురుమిత్రుల కుటుంబాలు, కుమార్ కుటుంబం మినీ బస్సులో కర్ణాటక, మహారాష్ట్ర టూర్‌కు వెళ్లారు. ఈనెల11న కర్ణాటకకు వెళ్లిన వీరు 18నగోవా నుంచి బయలు దేరి మహారాష్ట్రకు చేరుకున్నారు. కొల్హాపూర్ సమీపంలోని గగన్‌భవాడివద్ద వరద తీవ్రతకు మంగళవారం నుంచి వాహనాలు నిలిచిపోయాయి. మూడురోజులుగా భారీవర్షాలు కురుస్తుండడంతో పోలీసులు వాహనాలు నిలిపివేశారు. దీంతో మంచిర్యాల జిల్లాకు చెందిన వారు సెల్ఫీవీడియో ద్వారా ప్రభుత్వ యంత్రానికి విన్నవించారు. వారిని మంగళవారం రాత్రి చిన్నషెడ్‌లో ఉంచిన పోలీసులు బుధవారం ఇతర మార్గాలనుంచి పంపించే యత్నం చేయగా మళ్లీ బస్సు వరదలో చిక్కుకున్నట్టు బాధితులు పేర్కొంటున్నారు. వరదలు తగ్గితే కానీ పంపించే అవకాశం లేదని పోలీసులు పేర్కొంటున్నట్టు తెలిపారు.

వినాయక విగ్రహాన్ని తాకిన విద్యుత్ తీగలు

● రోడ్డుపైనే అరగంట ఆగిన వాహనం


విద్యుత్ తీగలు అడ్డు రావడంతో ఆగిన ట్రాక్టర్

ఎండపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో రోడ్డుపైనే ట్రాక్టర్ అరగంట పాటు ఆగింది. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన యూత్ సభ్యులు కోరుట్ల నుంచి వినాయకుడిని ట్రాక్టర్‌పై స్వగ్రామానికి తీసుకెళ్తున్నారు. ఈక్రమంలో కొత్తపేట రహదారిపై వినాయక విగ్రహానికి తీగలు తట్టడాన్ని గమనించిన యూత్ సభ్యులు అప్రమత్తమై వాహనాన్ని అక్కడే ఆపి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో విద్యుత్ సిబ్బంది కరెంట్ ఎల్‌సీ తీసుకోవడంతో ట్రాక్టర్ ముందుకు కదిలింది. వినాయక నిమ జ్జనం నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు ముందస్తుగా స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిండుకుండలా శ్రీరాంసాగర్



● ప్రస్తుత పరిస్థితి ఇలా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 2,07,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 68.065 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 1,31,867 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 25 వరద గేట్ల ద్వారా 1,02,850 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,000 క్యూసెక్కులు, వరద కాలువకు 20,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 636 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

- ఆయకట్టు రైతుల్లో ఆనందం
- ఇప్పటికే ప్రాజెక్టు గేట్లు తెరిచి దిగువకు నీరు
- కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు

జగిత్యాల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన గేట్లను పైకి ఎత్తి దిగువ గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. కాకతీయ కాలువ, వరద కాలువలకు పుష్కలంగా నీరు విడుదల చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో సాగు, తాగు నీటికి ఇబ్బందులు దూరం కానున్నయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులు, మత్స్యకారుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి అధికంగా వరద నీరు వచ్చి చేరుతోంది.

● మరమ్మతులకు నోచుకోని కాలువలు

కాకతీయ ప్రధాన కాలువ లైనింగ్ పలు ప్రాంతాల్లో పగుళ్లు తేలింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, బీమారం, జగిత్యాల రూరల్, మల్యాల, కొడిమ్యాల మండలాల్లో ప్రవహించే ఈ కాలువలో నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం శ్రీరాంసాగర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో వానాకాలంతో పాటు యాసంగిలోనూ పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. కాకతీయ కాలువ ఉప కాలువలకు తాత్కాలిక మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. పలు ప్రాంతాల్లో కాలువ లైనింగ్ దెబ్బతినడం, పిచ్చి మొక్కలు పెరగడం, పూడికతీత చేరుకపోవడం వంటి సమస్యలున్నాయి. ఎస్సారెస్పీలో పుష్కలంగా నీరు ఉండడంతో జగిత్యాల జిల్లాలోని గోదావరి తీరంలో ఉన్న ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, రాయికల్ తదితర మండలాల్లో గల ఎత్తిపోతల పథకాల కింద సాగయ్యే పంటలకు నీరందే అవకాశం ఉంది.


కాకతీయ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

● వరద కాలువ, కాకతీయ కాలువల ద్వారా..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద పెరుగుతుండడంతో వరద కాలువ, కాకతీయ కాలువ ద్వారా అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువకు మొదట రెండు వేల క్యూసెక్కుల నుంచి పెంచి చివరకు 20 వేల క్యూసెక్కుల నీటి విడుదల పెంచి వదులుతున్నారు. కాకతీయ కాలువ ద్వారా 4 వేల నుంచి 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● సాగు, తాగు నీటి కష్టాలు తీరినట్లే..

ప్రస్తుత యేడాది జూన్ ఒకటో తేదీ నుంచి ఈనెల 19వ తేదీ ఉదయం 6 గంటల వరకు 82.683 టీఎంసీల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. ప్రాజెక్టులో అవసరాల మేరకు నిల్వ చేసి మిగులు నీటిని సుమారు 22.026 టీఎంసీలను సాగునీటి కాలువలు, గోదావరి నది దిగువకు వదిలారు. ఈనెల రెండో తేదీ నుంచి ఐదో తేదీ వరకు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈనెల 17 నుంచి మిగులు నీటి విడుదల జరుగుతోంది. ప్రాజెక్టు కింద కాకతీయ, సరస్వతీ, లక్ష్మీ, వరద కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాల కింద సుమారు 7.5 లక్షల ఎకరాలకు నీరు అందిస్తున్నారు.

పాముకాటుతో రైతు మృతి


రమేష్(ఫైల్)

చిగురుమామిడి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరగిరి గ్రామా నికి చెందిన మేడబోయిన రమేష్ (40) అనే యువ రైతు తన వ్యవసాయబావి వద్ద మంగళవారం ఉదయం పాముకాటుతో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రోజువారి కార్యక్రమంలో భాగంగా రమేష్ వ్యవసాయ పనులు చేసేం దుకు ఉదయం పొలం గట్టుపైనుంచి నడుస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అప్పటికే పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామమాజీ ఎంపీటీసీ తిరుపతి తెలిపారు.

మహిళను కాటు వేసిన పాము

శంకరపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం అర్కండ్ల గ్రామంలో మహిళ పాము కాటుకు గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్కండ్ల గ్రామానికి చెందిన చర్ల రేణుక తన భర్త కోటయ్యతో కలిసి వ్యవసాయ పొలంలో వరికలుపు తీస్తోంది. ఈక్రమంలో అకస్మాత్తుగా పాము వచ్చి ఆమె చేయిపై కాటేసింది. గమనించిన కోటయ్య వెంటనే 108కు సమాచారం అందించారు. 108 వాహనం సిబ్బంది తక్షణమే అక్కడికి చేరుకొని రేణుకకు ప్రథమచికిత్స అందిస్తూ కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులు

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ స్టేజి సమీపంలో ఈనెల18న రాత్రి ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న విషయం విదితమే. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా రోడ్డు పక్కకు పెట్టించారు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు ఆ కారుకు సంబంధించి ముందు, వెనకల ఉన్న నాలుగు టైర్లను దొంగిలించుకొని పోయారు. దీన్ని స్థానికులు చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. కారు టైర్లు ఎత్తుకెళ్లిన దుండగులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాటర్ ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకుంటాం

● మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్


వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేయిస్తున్న కమిషనర్ మహమ్మద్ అయాజ్

జమ్మికుంట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్‌ప్లాంట్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని ఓ వాటర్ ప్లాంట్‌ను అధికారులతోకలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాటర్‌ప్లాంట్ అపరిశుభ్రంగా ఉండటం, క్యాన్లలోపురుగులు ఉండటాన్ని గమనించి ఆగ్రహంవ్యక్తం చేసి సీజ్ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాటర్ ప్లాంట్లలోని క్యాన్లను మూడు నెలలకు ఒకసారి మార్చాలన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలో 25 వాటర్ ప్లాంట్లు ఉన్నాయని, విడుతల వారీగా అన్నింటినీ తనిఖీ చేస్తామన్నారు.

● గణేష్ స్టోర్స్‌కు జరిమానా..

జమ్మికుంట పట్టణంలోని కొండూరి కాంప్లెక్స్‌లో గల గణేష్ జనరల్‌స్టోర్స్‌ను మున్సిపల్ కమిషనర్ తనిఖీ చేశారు. అల్లం పేస్ట్ డబ్బాలపై ఎలాంటి స్టిక్కర్లు లేకపోవడాన్ని గమనించి మందలించారు. బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లు విక్రయించడంపై జరిమానా విధించారు. మరోసారి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లి సోదరుడు రాజేశం మృతి


రోదిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ సోదరుడు (చిన్న అన్నయ్య) కవ్వంపల్లి రాజేశం బుధవారం మృతిచెందారు. ఆంధ్ర బ్యాంకులో ఉద్యోగం చేసిన కవ్వంపల్లి రాజేశం ఏడేళ్ల కిందట ఉద్యోగవిరమణ పొందారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో 20 రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. వైద్యుల సూచన మేరకు చివరి దశలో కరీంనగర్‌లోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు పరామర్శించారు. కవ్వంపల్లి రాజేశం అంతిమ యాత్రలో జిల్లాకు చెందిన పలువురు ముఖ్యనేతలు, మానకొండూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మార్కెట్ కమిటీ చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగం కల్పించేలా విద్యార్థులు ఎదగాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్

రామగిరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం సాధించేవిధంగా కాకుండా పలువురికి ఉద్యోగం కల్పించే లక్ష్యంతో విద్యార్థులు ఎదగాలని జెఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(అలీప్)ఆధ్వర్యంలో ప్రపంచబ్యాంకు నిధులతో భారతప్రభుత్వం నిర్వ హిస్తున్న రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ అండ్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహాపరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ)స్థాపనలో భాగంగా తెలంగాణప్రభుత్వం పరిశ్రమలశాఖ, జిల్లా గ్రామీణఅభివృద్ధిసంస్థ సంయుక్తంగా మంథని జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ ప్రొఫెసర్ ఆర్ శ్రీదేవి నేతృత్వంలో జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో యువ అంకుర సంస్థలకు, ఔత్సాహికులకు అవగాహన కల్పించారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కిషన్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసదస్సుకు హాజరైన250మంది విద్యార్థులకు 15రోజులపాటు స్కిల్‌డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ప్రభుత్వం ఫడింగ్ స్కీంలు, నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అలీప్ డైరెక్టర్ కన్నెంటి రమాదేవి, ఛీఫ్ ఇన్నోవేషన్ అధికారి డాక్టర్ జహరుల్లా, వైస్ ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్,మేనేజర్ నవీన్‌కృష్ణ,సాజీద్,వంశీ,కావ్యతదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్ర్కాప్ బస్సును ఢీకొన్న లారీ

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణకాలనీ వద్ద రాజీవ్ రహదారి వద్ద నిలిపి ఉంచిన ఆర్టీసీస్ర్కాప్ బస్సు(పాడైన, పనికి రాని)ను లారీ ఢీకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కిచెందిన వారు స్ర్కాప్‌లో 4 ఆర్టీసీబస్సులను కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళుతున్నారు. ఒకస్ర్కాప్ బస్సు డ్రైవర్ రామకృష్ణ కాలనీ వద్ద బుధవారం తెల్లవారుజామున రోడ్డు పక్కన టీ తాగేందుకు ఆపాడు. ఈ క్రమంలో కరీంనగర్ వైపు నుంచి హైదారాబాద్ వైపునకు వెళుతున్న లారీ, బస్సును ఢీ కొంది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకువెళ్లింది. బస్సు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

వరకట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య


భావన(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భర్తతో పాటు అత్తింటివారి వరకట్నం వేధింపులు భరించలేక కరీంనగర్‌లో నివాసం ఉంటున్న కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమార్‌పేటకు చెందిన భావన అలియాస్ మానస(26)మంగళవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి, పోలీసులవివరాల ప్రకారం.. సోమార్‌పేటకు చెందిన భావన అలియాస్ మానసకు గాంధారి మండలం పేట్‌సంగెం గ్రామానికి చెందిన అబ్రం జ్ఞానేశ్వర్‌తో 2023నవంబరులో వివాహమైంది. వీరికి 6నెలల కూతురు ఉంది. వివాహసమయంలో 16తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, ఇతరలాంఛనాలు అత్తింటివారికి ముట్టజెప్పారు. అబ్రం జ్ఞానేశ్వర్ కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో కెప్టెన్‌గా పనిచేస్తూ భార్య, కూతురుతో కలిసి స్థానిక భగత్‌నగర్‌లో అద్దెఇంటిలో ఉంటున్నాడు. ఏడాది నుంచి భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనపుకట్నం తేవాలంటూ భావనను మానసికంగా వేధిస్తున్నారు. తండ్రి ఆస్తిలో 3వ వంతు తేవాలని వేధించేవారు. ఈ విషయాన్ని తరచూ భావన తన తండ్రి,తల్లి వద్ద చెప్పు కుంటూ బాధపడుతుండేది. ఈ బాధలు తాళలేక తన కూతురు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని తండ్రి క్యాస కిష్టయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. భర్త జ్ఞానేశ్వర్ హోటల్‌లో విధులు ముగించుకొని అర్ధ రాత్రి 12గంటలకు ఇంటికి వెళ్లేసరికి భావన ఉరికి వేళాడుతూ కనిపించింది. కరీంనగర్ ఏసీపీ వెంకటస్వామి, సీఐ రాంచందర్‌రావు సంఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఫోరెన్సిక్ నిపుణులతో తనిఖీ చేయించినట్లు, భర్త, అత్త, మామ, ఆడపడుచులపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి

- ఇన్‌చార్జి మంత్రి తుమ్మల అధ్యక్షతన హైదరాబాద్‌లో సమావేశం
- ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు


సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్‌పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై, క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనాయకులతో ఉన్నతస్థాయి సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో బుధవారం ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పలు అంశాలపై సమీక్షించారు. యువతకు ఉపాధి అవ కాశాలు కల్పించే విషయంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహం అందించే విషయంలో అందరూ దృష్టిసారించాలన్నారు. రైతు బజార్లను విస్తరించాలని, ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టిని సారించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూడాలని తెలిపారు.

● పార్టీని బలోపేతం చేయాలి..

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రధానంగా గ్రామ, మండల స్థాయిల్లో పార్టీని బలోపేతం చేయాలని, వారి ద్వారా ప్రజల సమస్యలనుతెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల జిల్లా మంత్రులను, ఎమ్మెల్యేలను, నియోజకవర్గాల ఇన్‌చార్జిలకు సూచించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు తమ తమ నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఆ సమాచారాన్ని ఇన్‌చార్జి మంత్రికి అందజేశారు. సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరిస్తూ ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకో వాల్సిన చర్యల గురించి ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువచ్చారని సమాచారం.

ప్రధానంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు, విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, పంట నష్టపరి హారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఇన్‌చార్జి మంత్రి తుమ్మల సూచించినట్లు తెలిసింది. త్వరలోనే ఇరిగేషన్, రోడ్లు, భవనాలశాఖ మంత్రులతో కలిసి ఆయాశాఖల ప్రత్యేకసమీక్షా సమావేశాలను నిర్వహిస్తామన్నారు. దీనిద్వారా ఉమ్మడిజిల్లా పరిధిలో ఉన్న అన్ని సాగునీటి సమస్యలు, రోడ్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తుమ్మల ప్రజాప్రతినిధులకు వివరించారు.

● 'కరీంనగర్'పై చర్చ

ఈ సందర్భంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామక విషయం కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, విజయరమణారావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్ కరీంనగర్ ఇన్‌చార్జిని నియమించకపోవడంతో జిల్లా కేంద్రంలో పార్టీ బలహీనపడుతోందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీని ప్రభావం పెద్దపల్లి, చొప్పదండితో పాటు సమీప నియోజకవర్గాలపై పడుతున్నదని, వెంటనే ఈ సమస్యను పరిష్కరిం చాలని కోరినట్లు తెలిసింది. మంత్రి శ్రీధర్‌బాబు కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని సమాచారం. వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, గత ఎన్నికల్లో కరీంనగర్ కార్పొరేషన్‌లో 60 డివిజన్లకు ఒక్క డివిజన్‌ను కూడా గెల్చుకోలేకపోయామని, అలాగే 26 గ్రామాల్లో కూడా స్థానిక ప్రజాప్రతినిధులను గెలిపించు కోలేక పోయామని తెలిపారు. కరీంనగర్‌లో పార్టీ పరిస్థితి ప్రస్తుతం ఆశాజనకంగా లేదని, నియోజకవర్గ ఇన్‌చార్జిని నియామకంలో జాప్యం చేస్తే పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చని మంత్రి తుమ్మలకు వివరించారని తెలిసింది. దీంతో వెంటనే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిని నియమించాలనే అభిప్రాయానికి మంత్రులు వచ్చినట్లు సమాచారం. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ భానుప్రసాద్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, ఆది శ్రీనివాస్, విజయరమణారావు, రాజ్‌ఠాకూర్, డాక్టర్ సంజయ్ కుమార్, నియోజకవర్గ ఇంచార్జిలు వొడితెల ప్రణవ్, జువ్వాడి నర్సింగరావు, కేకే మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, వి నరేందర్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భార్యాపిల్లల బాగోగులు చూడని ఉద్యోగి సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన పెద్దపల్లి కలెక్టర్

పెద్దపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తరచుగా గృహహింసకు పాల్పడుతూ భార్యాపిల్లల బాగోగులు పట్టించుకోని ప్రభుత్వ ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ బుధవారం పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఓదెల ప్రాథమికఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న కె రవీందర్ తమ పోషణను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆయన భార్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక సఖికేంద్రం సిబ్బంది భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించడానికి ప్రయత్నించగా రవీందర్ సహకరించ లేదన్నారు. గృహహింస నిరోధక చట్టం ప్రకారం మరోసారి జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ నోటీసులు జారీ చేసినప్పటికీ రవీందర్ కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కలెక్టర్‌కు నివేదిక అందించారు. ప్రభుత్వ ఉద్యోగుల పరివర్తన నియమావళి ప్రకారం భార్యాపిల్లల పోషణను నిర్లక్ష్యం చేస్తున్న ఫార్మాసిస్టు కె రవీందర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

తిమ్మాపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామశివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఎల్లమ్మ విగ్రహంపై ఉన్న బంగారు, వెండి ఆభరణలు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. వాటి విలువ సుమారు 20వేల వరకు ఉంటుందన్నారు. ఈ మధ్య మండలంలో చాలా గ్రామాల్లోని ఆలయాల్లో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులతో ఉద్యోగాలు

● హైదరాబాద్‌కు వెళ్లిన విద్యార్థులు



పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న యువకులు

పెద్దపల్లి కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిలో గల ప్రభుత్వ ఐటీఐలో టాటా కంపెనీ నూతనంగా తీసుక వచ్చిన కోర్సులతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఆయా కోర్సులు చదివిన నిరుద్యోగులకు హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగాలు రావడంతో బుధవారం పెద్దపల్లి రైల్వేస్టేషన్ నుంచి పలువురు హైదరాబాద్‌కు వెళ్లారు. పెద్దపల్లి ఐటీఐలో టాటా కంపెనీ మ్యాను ఫ్యాక్చరింగ్‌లో ఏడాది కోర్సును ప్రవేశపెట్టింది. ఈ కోర్సును పలువురు విద్యార్థులు అభ్యసించారు. ఇటీవల కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూ లకు వారు హాజరు కావడంతో చాలామందికి ఉద్యోగం కల్పిస్తూ అపాయింట్ మెంట్ లెటర్లు అందాయి. దీంతో వారు హైదరాబాద్‌లోని తుక్కుగూడలోని ఇన్ఫోసిస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఐటీఐలో చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా లభిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో సాయి రోహిత్ గౌడ్, సుమిత్, ఆదిత్య, ముఖేష్, పి సాయి కిరణ్, ఎ సాయి కిరణ్, ఫరాజ్, నితిన్, ఎ శివమణి, అభి, శివకుమార్, యశ్వంత్, అభిలాష్, రేవంత్ తదితరులు ఉన్నారు.

తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలకు ఉమ్మడి జిల్లా వాసులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో కృషి చేస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 48 మందిని తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారాలతో సత్కరించనుంది. ఈ క్రమంలో విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెల్దండ నిత్యానంద రావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ ఆయారంగాలకు చెందిన ప్రముఖులను ఎంపిక చేసి జాబితా విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఐదుగురు ఎంపికవడం విశేషం. ఎంపికైన వారిలో ఎస్.రఘువర్మ (అనువాదరంగం-జగిత్యాల), మంగారి హిమజ (రచనారంగం-వేములవాడ), పిన్నంశెట్టి కిషన్ (కథారంగం-వేములవాడ), రతన్‌కుమార్ (పేరిణీనృత్యం-కరీంనగర్), పాతూరి మహేందర్‌రెడ్డి (ఉపాధ్యాయరంగం-రాజన్నసిరిసిల్ల) ఉన్నారు. వీరికి తెలుగు విశ్వవిద్యాలయం-నాంపల్లి ప్రాంగణంలో రూ.5,116 చొప్పున నగదుతో కూడిన పురస్కారం అందజేయనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు.

కనుమరుగవుతున్న జానపద కళలు



ఒగ్గుడోలు, బోనాల కళాకారులు (ఫైల్)

● ఆదుకోవాలంటున్న కళాకారులు
● రేపు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విశిష్ట సంప్రదాయానికి సజీవ సాక్ష్యమైన జానపద కళలు కనుమరుగవుతున్నాయి. కళనే నమ్ముకున్న వేలాది మంది కళాకారులు రోడ్డున పడుతున్నారు. కళలు వెలుగులోకి రావడం లేదు. కళాకారులకు పొట్ట గడవని దుస్థితి ఏర్పడింది. ఆధునికత, ప్రపంచీకరణ, సామాజిక మార్పులు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కళలను దెబ్బతీశాయి. 22న అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం సందర్భంగా ఓ కథనం.



గొల్ల సుద్దులు కళారూపం (ఫైల్)

● నేపథ్యం..

1926లో అమెరికాలో హెన్నీ హెరాల్డ్ లూయిస్ ఆయా దేశాల, ప్రాంతాల కళలకు ప్రాచుర్యం లభించేందుకు జానపద కళల దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించారు. ఈ క్రమంలో యేటా ఆగస్టు 22న ఈ దినోత్సవం జరుపుకుంటారు.

● జిల్లాలో జానపద కళల స్థితి..

ఉమ్మడి జిల్లాలో దాదాపు ఆరు వేల మంది జానపద కళాకారులున్నారు. కొందరు కళనే వృత్తిగా చేసుకొని జీవనోపాధి పొందుతుంటే మరికొందరు పూట గడవని స్థితిలో ఉన్నారు. మిద్దెరాములు, గోపాల్‌రాజ్ భట్టు, గోలి రాజగోపాల్‌రెడ్డి, రతన్‌సింగ్, వెంకటేశ్ నాయక్, కళాచందర్, జనమంచి రాములు, రజనీశ్రీ, కోడూరి రవీందర్‌గౌడ్ వంటి కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. జి కృపాదానం, సంగెం రాధాకృష్ణ, కచ్చు అంజయ్య, దొడ్ల మల్లయ్య, గోపాల్‌రావు, రాజమౌళి, కనకం రమణయ్య, అందాసి నారాయణ, కోడూరి పోచయ్య, ఎండీ ఇస్మాయిల్, తీగల రాజేశం, రాములు, గజవెల్లి వెంకటనరసయ్య వంటి వారు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కళా ప్రదర్శనలిస్తూ జిల్లాకు కీర్తి తీసుకవస్తున్నారు. ఉత్సవాలు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంలో తప్ప వీరి ప్రదర్శనలకు వీలు లేకుండా పోయింది. కొందరు పెన్షన్ అందుకుంటున్నా ఆ డబ్బులు సరిపోక గ్రామాలు తిరుగుతూ పొట్ట పోసుకుంటున్నారు. ప్రభుత్వం ఉద్యోగాలిచ్చినా అర్హులైన వారికి ఉద్యోగాలు రాలేదనే విమర్శలు వస్తున్నాయి.

కళాకారుల డిమాండ్లు

- రాష్ట్ర ఆవిర్భావ దినం జూన్ 2ను జానపద కళల దినోత్సవంగా ప్రకటించాలి.
- ప్రతి జిల్లాకు కల్చరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్‌ను నియమించాలి.
- యేటా జానపద కళోత్సవాలు నిర్వహించాలి.
- విశ్వ విద్యాలయాల్లో సర్టిఫికెట్ కోర్సు ప్రవేశపెట్టి సీనియర్ కళాకారులకు, ఔత్సాహికులకు అవకాశం కల్పించాలి.
- అర్హులైన కళాకారులను గుర్తించి ఉద్యోగాలు, ఇళ్లు, పెన్షన్లు, జీవన భృతి అందించాలి. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

● మలి దశ ఉద్యమంలో జానపదం...

తెలంగాణ మలి దశ సాంస్కృతికోద్యమంలో జానపద కళలు కీలక పాత్ర పోషించాయి. కళాకారులు తమ కళారూపాలతో నిరసనలు తెలిపారు. ప్రజా చైతన్యం కోసం ఊరూరా ఆటాపాటలతో తిరిగారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తమను పట్టించుకునే వారే లేరని కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి జానపద కళోత్సవాల జాడ లేకుండా పోయింది. నూతన ప్రభుత్వం ఏర్పడ్డాకైనా కళాకారులకు సముచిత గుర్తింపు వస్తుందని ఎన్నో ఆశలతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 400 మందికి పెన్షన్లు వస్తుండగా, జిల్లాలు వేరైన తర్వాత అదనపు కోటా కేటాయించాల్సి ఉంది.



చిరుతల భజన

డప్పు నృత్యం

బుడుబుక్కలవారు



కళలకు ప్రాధాన్యమివ్వాలి..

\- గుండ్ర కృపాదానం, జానపద కళాకారుడు

ప్రాచీన జానపద కళలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. కళలు, కళాకారుల గుర్తింపులో ప్రభుత్వం ప్రధాన భూమిక పోషించాలి. పెన్షన్లు అందరికీ అందేలా చూడాలి.



పేద కళాకారులకు న్యాయం చేయాలి...

\- కనకం రమణయ్య, జానపద కళాకారుడు

ప్రభుత్వం జానపద కళాకారులను ఆదుకోవాలి. ఉమ్మడి 10 జిల్లాల్లోని కళలను వెలికి తీయాలి. పేద కళాకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి.



పూర్వ వైభవం తీసుకురావాలి..

\- అందాసు నారాయణ, జానపద కళాకారుడు

కళలకు పూర్వ వైభవం తీసుకురావాలి. కవులు, గాయకులు, కళాకారులు ఏకం కావాలి. సృష్టిలో జానపదానికి ముగింపు లేదు. నాయకులను, ప్రజలను చైతన్య పరిచేది జానపదం.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తికి మరింత జాప్యం

● సమీక్ష జరిపిన సీఎండీ శర్వానంద్ ● డెన్మార్క్ నుంచి హల్దర్ టాప్ ఇంజనీర్ రాక



ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టులోని హెచ్‌టీఆర్

కోల్‌సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీతో షట్‌డౌన్ అయిన ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి పునరుద్ధరణకు మరింత జాప్యం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నెల 24న ఉత్పత్తి ప్రారంభమవుతుందని ప్రాజెక్టు వర్గాలు అంచనాల వేసినా అది సాధ్యపడే పరిస్థితి లేదు. మరో వారం నుంచి పది రోజులు కనీసంగా సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇప్పటికే టెక్నాలజీ సరఫరా చేసిన డెన్మార్క్‌కు చెందిన హల్దర్ట్ టాప్స్ ఇంజనీర్ ఒకరు రామగుండం చేరుకుని పరిశీలించారు. మరికొన్ని ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటేనే మరమ్మతులు జరిగే అవకాశం ఉంది. రెండు నెలల క్రితం వార్షిక మరమ్మతుల సమయంలో కీలకమైన హెచ్‌టీఆర్‌ను బైపాస్ చేశారు. దాన్ని వినియోగించకుండా ఉత్పత్తి ప్రారంభించడం వల్ల ఒత్తిడి పెరిగి అమ్మోనియా పైప్‌లైన్ లీకేజీ అవుతున్నట్టు తెలుస్తుంది. హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించాలంటే రూ.150కోట్ల నుంచి రూ.200కోట్లు అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించేందుకు ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుం ది.హల్దర్ సంస్థనే హెచ్‌టీఆర్‌ను సమకూర్చాల్సి ఉంటుంది. హెచ్‌టీఆర్‌ను పునరుద్ధరించకుండా మరమ్మతులు చేసినా మళ్లీ సమస్యలు ఉత్పన్నమవుతాయని యూరియా పరిశ్రమలో పనిచేసిన సాంకేతిక నిపుణులు పేర్కొంటు న్నారు. తెలంగాణలో యూరియా కొరత తీవ్రమవడం, రైతులు రోడ్ల మీదకు వచ్చిన పరిస్థితుల్లో తెలంగాణ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. పార్లమెంట్‌లో వాయిదా తీర్మాణం కూడా పెట్టారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ కార్యదర్శి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పునరుద్ధరణపై సమీక్ష జరుపుతున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ సీఎండీ శర్వానంద్ బుధవారం ఢిల్లీ నుంచి ఆర్ఎఫ్‌సీఎల్‌కు చేరుకుని అధికారులతో సమీక్ష జరిపారు. మరో వైపు ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమల ఉత్పత్తిని పునరుద్ధరించి తెలంగాణకు నిర్దేశించిన కోటాను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తుంది. ఆర్ఎఫ్ సీఎల్‌లో ఉత్పత్తికి మరింత జాప్యం ఏర్పడితే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యూరియా కొరత తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆర్ఎఫ్‌సీఎల్ కేంద్ర కార్యాలయం రామగుండంకు తరలించి యుద్ధప్రాతిపదికన నిర్ణయాలు తీసుకుంటేనే ఆర్ఎఫ్‌సీఎల్ సాంకేతిక ఇబ్బందుల నుంచి బయటపడే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల గోదావరిలోకి వరద ఉధృతి పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. ధర్మపురి పట్టణంలోని మంగళి గడ్డ స్నానఘట్టం వద్ద నుంచి పెరుగుతున్న గోదావరివరదను పరిశీలించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్ కుమార్ అధికారులతో మాట్లాడుతూ భారీవరదల నేపథ్యంలో గోదావరినదికి స్నానాలు చేసేందుకు వచ్చేభక్తులు లోపలికి వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షితప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ సిబ్బందిని అప్రమత్తంచేస్తూ నిత్యం అందుబాటులో ఉండేలాచర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తేచర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంపీడీవోరవీందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు ఉదయ్ కుమార్, రవికుమార్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్ ఉన్నారు.

ఉమ్మడిజిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శిగా అనూప్‌రెడ్డి



అనూప్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా కళాశాలల క్రీడాసమాఖ్య అండర్-19 కార్యదర్శిగా కొడిమ్యాల మోడల్‌స్కూల్, కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్ డి అనూప్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి గంగాధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యదర్శిగా నియామకమైన అనూప్ రెడ్డికి బుధవారం నియామకపత్రాన్ని అందజేశారు. 2025-26విద్యాసంవత్సరానికి ఉమ్మడి జిల్లా కళాశాలల క్రీడాసమాఖ్య కార్యదర్శిగా అనూప్‌రెడ్డి బాధ్యతలను నిర్వహిస్తారని డీఐఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కళాశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగే క్రీడాపోటీలను ఘనంగా నిర్వహించాలని అనూప్ రెడ్డికి డీఐఈవో సూచించారు. ఈసందర్భంగా అనూప్ రెడ్డిని ఉమ్మడి జిల్లాలోని పలువురు ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

బాలసాహితీవేత్త 'కందేపి'కి తెలుగు భాషా కీర్తి పురస్కారం



డాక్టర్ కందేపి రాణీప్రసాద్

సిరిసిల్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణి ప్రసాద్ తెలుగుభాషా కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు భాష, సంస్కృతి, వైభవం, సాహిత్యం, కళల పరిరక్షణ కోసం నిరంతరాయంగా కృషిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏటా అందించే తెలుగు భాషా కీర్తిపురస్కారాన్ని 2025 సంవత్సరానికి అందిస్తున్నట్లు చైర్మన్ కత్తిమండ ప్రతాప్ బుధవారం ప్రకటించారు. ఈనెల 31న గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆంధ్రాలోని పల్నాడుజిల్లా నరసరావుపేటలో నిర్వహించే తెలుగుభాషా దినోత్సవంలో రాణీప్రసాద్‌కు పురస్కారాన్ని అందించనున్నారు. అనేక కొత్త ప్రయోగాలు చేసి, బాలల మానసిక, వైజ్ఞానిక వికాసం కోసం డాక్టర్ కందేపి రాణీప్రసాద్ చేస్తున్న అవిరళ కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. రాణీప్రసాద్ గత 35సంవత్సరాల్లో 55పుస్తకాలు రచించారు. బాలసాహిత్యంలో వైజ్ఞానిక రచనలు అంశంపై పీహెచ్‌డీ చేశారు. అవార్డుకు ఎంపికైన రాణీప్రసాద్‌ను మానేరు రయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, జిల్లా రయితల సంఘం కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారి దర్శనానికి క్యూలో నిలుచున్న భక్తులు

వేములవాడ రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం సందర్భంగా ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు తలనీలాలు సమర్పించి క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కులను చెల్లించుకున్నారు. కాగా, రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలోని సీతారామచంద్ర స్వామివారికి బుధవారం పునర్వసునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజన్న ఆలయ హుండీ లెక్కింపు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి హుండీ ఆదాయాన్ని బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో లెక్కించారు. 34రోజులకు హుండీ ఆదాయం కోటి 97లక్షల 54 వేల 588రూపాయలు, 170 గ్రాముల బంగారం, 10కిలోల 300గ్రాముల వెండి సమకూరినట్లు అధికారులు వెల్లడించారు. ఈవో రాధాబాయి హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. కార్యాలయ పరిశీలకులు, ఏసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



శృతిక

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని శృతిక జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని హెచ్ఎం మధుమాలతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18, 19వ తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శృతిక, అశ్లేషలు పాల్గొన్నారని పేర్కొన్నారు. శృతిక ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఈనెల 26, 27 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో బాలేవాడీ మైదానంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని శృతిక పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పీడీ అక్బర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

తపాలా ఉద్యోగులకు వేతన సంఘాన్ని ఏర్పాటు చేయండి

● తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్



డిమాండ్ల ప్రతులతో నిరసన తెలుతున్న ఉద్యోగులు

ఓదెల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తపాలా ఉద్యోగులకు 8వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ (సి) రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ కోరారు. బుధవారం పొత్కపల్లి, ఓదెల తపాలా కార్యాలయాల వద్ద భోజన విరామం సమయంలో తపాలా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్ల ప్రతులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ నేటి వరకు 8వ వేతన కమిటీని నియమించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లు తీవ్ర ఆందోళనకు, నిరాశనకు గురతున్నారని తెలిపారు. 2026 జనవరి ఒకటి నుంచి చెల్లించాల్సిన నూతన వేతనాలకు ఇప్పటివరకు వేతన సంఘం చైర్మన్, సంఘ సభ్యులను నియమించక పోవడం శోచనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, సేవలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ ఉద్యగులు ప్రజలకు త్వరగా పారదర్శకంగా అందిస్తున్నప్పటికీ ఉద్యోగుల వేతన సవరణ విషయం లో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమని అన్నారు. జనవరి ఒకటి నుంచి నూతన వేతనాలు అందించాలని అలాగే గ్రామీణ తపాలా ఉద్యోగులను 8వ వేతన సంఘంలో చేర్చాలని అన్నారు. పెన్షనర్లకు యధావిధిగా పెన్షన్లు అందచేయాలని కోరారు. అలాగే పాత పెన్షన్ ప్రకారం ప్రయోజనాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపాల ఉద్యోగులు ఉస్మాన్, ముత్తయ్యవెంకటేష్, సాయిరాం, రఘు, రిషిక, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'గాయత్రి' నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

● ఎస్సారెస్పీతో కలిపి 19,150క్యూసెక్కుల నీరు మిడ్ మానేరుకు తరలింపు



గాయత్రి పంపుహౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

రామడుగు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఇంత వరకు మూడు, నాలుగు పంపుల ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలిస్తున్న అధికారులు ప్రస్తుతం ఎస్సారెస్పీనుంచి నీరు వస్తున్న నేపథ్యంలో మంగళవారం ఒక్క పంపునకు కుదించారు. అయితే బుధవారం కూడా ఒక్కపంపు ద్వారా 3150 క్యూసెక్కుల నీరు పంపుహౌస్ నుంచి వరద కాలువకు తరలివెళ్తోంది. అలాగే ఎస్సారెస్పీ నుంచి 16వేల క్యూసెక్కుల నీరు వరదకాలువలో చేరుతోంది. దీంతో ప్రస్తుతం వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 19,150 క్యూసెక్కుల నీరు తరలివెళ్తోంది. ప్రస్తుతం ఎస్సారెస్పీప్రాజెక్టు నుంచి వరద కాలువకు నీటి ప్రవాహం పెరుగు తుండగా ఇంకా పెద్ద మొత్తంలో ఇక్కడికి నీరు వచ్చేఅవకాశం ఉండడంతో అధికారులు గాయత్రి పంపుహౌస్‌లో పంపులను తగ్గించారు. ప్రస్తుతం గాయత్రి పంపుహౌస్ నుంచి 3150, ఎస్సారెస్పీ నుంచి 16 వేల క్యూసెక్కుల నీరు వరద కాలువకు చేరుతోంది. రెండువైపులా వచ్చి 18,150 క్యూసెక్కుల నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు నీరు తరలివెళ్లడంతో వరద కాలువ నిండుకుండలా తయారవడంతో రైతుల కళ్లలో ఆనందం కదలాడుతోంది. ఖరీఫ్ గట్టెక్కుతుందనే నమ్మకంలో ఉన్నారు.

సిరిసిల్ల వద్ద మానేరు పరవళ్లు

● ఎగువ మానేరు ప్రాజెక్టు నుంచి 9734 క్యూసెక్కుల వరద నీరు
● మిడ్ మానేరు ప్రాజెక్టులోకి గోదావరి జలాలు



జలకళ సంతరించుకున్న మానేరు వాగు

సిరిసిల్ల ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మానేరు వాగు పరవళ్లు తొక్కుతోంది. జిల్లాలోని గంభీరావుపేట మండలం నర్మాల ప్రాజెక్టులోకి కూడెల్లి, పాల్వంచ వాగుల నుంచి భారీగా వరద నీరు చేరి మత్తడి దూకుతోంది. ప్రాజెక్టు నుంచి మానేరు వాగులోకి 9734 క్యూసెక్కుల వరదనీరు పరవళ్లు తొక్కుతూ మిడ్‌మానేరు ప్రాజెక్టులోకి చేరుతోంది. బుధవారం మానేరు జలకళను చూడడానికి సిరిసిల్ల ప్రజలు వాగు వద్దకు తరలివచ్చారు. మానేరు జలాలకు పూజలు చేశారు. ఎగువ మానేరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 9734 క్యూసెక్కులు కొనసాగుతోంది. జిల్లాలోని శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులో 27.55 టీఎంసీలకు 14.89 టీఎంసీలకు చేరుకుంది. మిడ్‌మానేరు ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు వరద కాలువ ద్వారా 13802 క్యూసెక్కులు నీళ్లు వస్తుండగా, మానేరు, మూలవాగు వరదనీరు 200 క్యూసెక్కులు చేరుతుంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 17152 ఉండగా, అన్నపూర్ణ ప్రాజెక్టుకు అవుట్ ఫ్లో 3310 క్యూసెక్కులు కొనసాగుతోంది.

చేప పిల్లల పంపిణీకి లైన్ క్లియర్

(5వ పేజీ తరువాయి)

చేప పిల్లల పంపిణీ బాగానే జరిగినప్ప టికీ, ఆ తర్వాత పంపిణీలో జాప్యం జరగడంతో పాటు నాణ్యత లేనివి, తక్కువ సైజు గల చేప పిల్లలను కాంట్రాక్టర్లు సరఫరా చేశారు. చేప పిల్లలకు బదులు నగదు డబ్బులు ఇవ్వాలని కొంత కాలంగా మత్స్యకార సహకార సంఘాల నాయకులు కోరుతున్నా, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. వర్షాలకు ఎప్పుడు చెరువులు, కుంట లు నిండుతాయో ఆ వెంటనే మత్స్య కారులు ప్రభుత్వ, ప్రైవేట్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల నుంచి చేప పిల్లలను కొనుగోలు చేసి అందులో పోసుకునే వెసు లుబాటు ఉంటుంది. ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం లేనప్పుడు, గతంలో మత్స్యకారులు చేప పిల్లలను కొనుగోలు చేసి పెంచి ఉపాధి పొందే వారు. ఇప్పుడు ప్రభుత్వం ఎప్పుడు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తుందా అని ఎదురు చూడాల్సి వస్తున్నదని మత్స్యకారులు అంటున్నారు.

● **పంపిణీలో జాప్యం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది అక్టోబర్‌లో ఆలస్యంగా నాణ్యత లేని, తక్కువ సైజు గల చేప పిల్లలను కాంట్రాక్టర్లు తీసుకురావడంతో వాటిని మత్స్యకారులు తిరస్కరించారు. చెరువుల్లో చేప పిల్లలు పోయకుండా వెళ్లగొట్టారు. అదను దాటిన తర్వాత చేప పిల్లలను పంపిణీ చేయడం వల్ల ప్రయోజనం ఉండదని అంటున్నారు. ఈ ఏడాది కూడా చేప పిల్లల పంపిణీలో ఇప్పటికే జాప్యం జరిగింది. వాస్తవానికి టెండర్ల ప్రక్రియ జూలై నెలాఖరు వరకు పూర్తి చేస్తే ఆగస్టు మొదటి, రెండవ వారంలో చేప పిల్లల పంపి ణీ పూర్తయి ఉండేది. అయినా నెల రోజులు ఆలస్యంగా టెండర్లు పిలిచారు. ఈసారి టెండర్లు పిలవరని, చేప పిల్లలకు బదులు ప్రభుత్వం నగదు సరఫరా చేస్తారని అంతా భావించారు. కానీ ప్రభుత్వం చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించి టెండర్లను ఆహ్వానించారు. ఈ విషయమై జిల్లా మత్స్యశాఖాధికారి నరేష్ కుమార్ నాయుడు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ జిల్లాలో గల మత్స్యకారులకు కోటి 58 లక్షల 82 వేల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించామని, కావలసిన చేప పిల్లల కోసం టెండర్లను ఆహ్వానించామని, సెప్టెంబర్ ఒకటవ తేదీ గడువు ఉందన్నారు. నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేసేందుకు చర్య లు తీసుకుంటామని అన్నారు.

సుందిళ్ల బ్యారేజీలోకి భారీ వరద

మంథనిరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో బుధ వారం ఎల్లంపల్లి గేట్లు ఎత్తి వేయడంతో భారీగా వరద నీరు దిగువ ప్రాంతమైన సుందిళ్ల బ్యారేజీలోకి వస్తోంది. 4లక్షల 20 వేల 281 క్యూసెకుల నీరు వస్తోంది. అయితే బ్యారేజీలో 74గేట్లు ఎత్తి ఉండ టంతో ఆ నీరు దిగువకు పోతోంది. గోదావరి, మానేరు నదుల నుంచి నీరు దిగువకు భారీగా పోతోంది.

ఖనిలో విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్ల తొలగింపు

కోల్‌సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాం తంలో బుధవారం విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది తొలగించారు. కేబుల్ ఆపరేటర్లకు చెందిన కేబుల్స్‌తో పాటు వివిధ సంస్థలకు చెందిన ఇంటర్నెట్ కేబుళ్లను ఇష్టానుసారంగా పోల్స్‌కు కట్టారని అధికారులు పేర్కొంటున్నారు. అద్దె చెల్లిస్తున్నా ఇష్టా నుసారంగా కేబుళ్లను, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారని ఇంటర్నెట్ నిర్వాహకులు తెలిపారు.

యూరియా తరలకుండా చెక్ పోస్టులు

మంథనిరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంథని ప్రాంతానికి కేటాయించిన యూరియా ఇతర జిల్లాలకు అక్రమంగా తరలించ కుండా ఉండేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు అధికా రులు బుధవారం రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. మండ లంలోని సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీ వద్ద, అడవి సోమన్‌పల్లి వద్ద చెక్ పోస్టును అధికారులు ఏర్పాటు చేశారు. అడవి సోమన్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఓ వాహనంలో, సుందిళ్ళ చెక్ పోస్టు వద్ద మరో వాహనంలో తరలిస్తున్న యూరియా బస్తాలను పట్టుకుని వాహనాలను, బస్తాలను సీజ్ చేశారు.

ఎరువుల కర్మాగారం నుంచి లోడింగ్‌కు అనుమతిపై హర్షం

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం నుంచి 30శాతం లోడింగ్ స్థానిక లారీ యజమానులకు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించిందని, దీని కోసం కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కందూరి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం గంగానగర్‌లోని లారీ యార్డులో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో మాట్లాడుతూ యూరియా లోడింగ్ ఇవ్వడం వల్ల ఆరు వేల కుటుంబాలు బాగుపడతాయన్నారు.

ఇళ్ల నిర్మాణాలు అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణం శాంతినగర్‌నగర్‌లో తాము కొనుగోలు చేసిన భూముల్లో ఇళ్ల నిర్మాణా లు చేపట్టకుండా అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఐటీఐ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా అధికారు లను కోరారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు.

ఖనిలో సత్యసాయి కల్యాణ మండపం ప్రారంభం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సత్యసాయి మందిరంలో బుధవారం కల్యాణ మండపం ప్రారంభోత్సవం వైభవం గా జరిగింది. ఈ కార్యక్రమానికి సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు పి.వెంకట్రావు కళ్యాణమండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సివి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి, కన్వీనర్ ఎం శంకరయ్య పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగకు ఆత్మీయ సన్మానం

మంథని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంథని జరిగిన సభలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను మంథని మాజీ జెడ్పీటీసీ తగరం సుమలత-శంకర్‌లాల్‌లు బుధవారం ఘనంగా సన్మానించారు. తమ ఇంటికి ఆహ్వానించి గౌతమ బుద్ధుడి ప్రతిమ అందజేశారు.

25 నుంచి మండల క్రీడా పోటీలు

సుల్తానాబాద్, జూలై 24: (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఆరెపల్లి రాజయ్య తెలి పారు. వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.

చీకురాయి గ్రామవాసికి ఉస్మానియాలో డాక్టరేట్

పెద్దపల్లి రూరల్ , ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మండలంలోని చీకురాయి గ్రామానికి చెందిన పెంచాల సతీష్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఇంపాక్ట్ ఆఫ్ ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఆన్ అగ్రికల్చర్ సెక్టర్ - సెలెక్టర్ స్టడీ అనే అంశంపై పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సతీష్ సమర్పించారు.

పనుల జాతరపై అవగాహన సమావేశం

ఎలిగేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న ప్రారంభం కానున్న ఉపాధి హామీ పనుల జాతరపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ రావు బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈజీఎస్ ఏపీఓ సదానందం, ఏపీఎం గీత, ఉపాధి హామీ టీఏ రంజిత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంపీడీఓ కార్యాలయంలో ఆధార్ సవరణ

ఎలిగేడు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాల యంలో 21 నుంచి మూడు రోజులు ఆధార్ సవరణ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ భాస్కర్‌రావు తెలిపారు.

వైకుంఠ రథానికి దాతల విరాళం

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైకుంఠ రథంతోపాటు ఫ్రిడ్జ్ లేని కారణంగా మండల ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారని, ఈ మేరకు కమిటీని బుధవారం ఏర్పాటు చేసినట్లు మూల రమణారెడ్డి, కేతుపల్లి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మొదటిగా మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ రూ.10 వేలు తనవంతుగా వారికి అందించారు. ఆయనతోపాటు వ్యవ సాయ మార్కెట్ చైర్మన్ రూ.15 వేలు, వైస్ చైర్మన్ సబ్బని రాజమల్లు రూ.10వేలు మొత్తం లక్ష రూపాయల వరకు విరాళాలు అందాయి.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



పెద్దపల్లిలో జయంతి వేడుకలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు



సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



మంథనిలో నివాళులర్పిస్తు కాంగ్రెస్ శ్రేణులు

పెద్దపల్లిటౌన్‌ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణవేణ సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో దివంగత నేత, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి బుధవారం ఘనం గా నిర్వహించారు. దేశాభివృద్ధిలో ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమం లో నాయకులు నూగిల్ల మల్లయ్య, మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, దొడ్డుపల్లి జగదీష్, బొంకూరి అవినాష్, అమ్రేష్, సుభాష్ రావు, నెత్తెట్ల కుమార్ పాల్గొన్నారు.

● సుల్తానాబాద్: దేశ అభివృద్ధి కోసం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఎన్నో సంస్కరణలు తెచ్చా రని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక నెహ్రూ విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో టెక్నాలజీని ప్రవేశపెట్టి యువతకు ఉపాధి కల్పనలో, దేశ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించార న్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, పన్నాల రాములు, దామోదర్ రావు, జూపల్లి తిరుమల్ రావు, సాయిరి మహేందర్, కృష్ణ, రఫీ, రాజు, టీకే ప్రభాకర్ పాల్గొన్నారు.

● కళ్యాణ్‌నగర్ : సాంకేతికతలో ప్రపంచంలోనే భారతదేశాన్ని నెంబర్‌వన్ స్థానంలో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ నిలిపారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌రాజ్ ఆధ్వర్యంలో బుధ వారం జీఎం ఆఫీస్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు పెద్దెల్లి ప్రకాష్, కందూ రి శ్రీనివాసరెడ్డి, నజీమోద్దీన్ పాల్గొన్నారు.

● యైటింక్లయిన్‌కాలనీ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాలనీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో స్థానిక తెలం గాణ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు రేషవేని కేశవులు, యాదగిరి తిరుపతి, ఇరికి మహేష్, అనుమ రాములు, మోత్కురి అవినాష్, సారయ్యానాయక్ ఉన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలో కాం గ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య ఆధ్వ ర్యంలో బుధవారం భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి ఇరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షు డు గాజ నవేన సదయ్య, మునీర్, సబ్బని రాజమల్లు, అల్లం దేవెందర్, మాదాసి సతీష్, ఆరెల్లి రమేష్, రానవేన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఎలిగేడు : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సామ రాజేశ్వ ర్‌రెడ్డి, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, నరహరి సుధాకర్ రెడ్డి, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

● జూలపల్లి : దేశ మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కాం గ్రెస్ పార్టీ నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, దండె వెంకటేశ్వర్లు, కందుకూరి అంజయ్య, ముమ్మా డి రవి, అమరగాని లింగయ్యగౌడ్, ఎండి గౌస్‌పా షా,కొట్టె సంజీవ్, కోరెపు సంపత్ పాల్గొన్నారు.

● ధర్మారం: టెక్నాలజీ అభివృద్ధిలో రాజీవ్ గాంధీ చేసిన కృషి ఎంతో ఉందని మండల కాంగ్రెస్ నాయకులు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. బుధ వారం రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మెన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మెన్ అరిగె లింగయ్య, ధర్మపురి నియోజకవర్గ యువజన నాయకులు అజయ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సోగా ల తిరుపతి, పెద్దపల్లి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొల్లి స్వామి, కొత్త నర్సింహులు పాల్గొన్నారు.

● మంథని : మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను స్థానిక మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణు లు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిం చారు. రాజీవ్ ఆశయ సాధన కోసం మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పనిచేస్తామన్నారు. ఈకార్యక్ర మంలో ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, నేతలు అయిలి ప్రసాద్, గోటికార్ కిషన్‌జీ, మంథని సత్యం, పోలు శివ, పేరవేన లింగయ్యయాదవ్, ఎరుకల ప్రవీణ్, మంథని సురేష్, ఆరెల్లి కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

● కమాన్‌పూర్: భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతితో పాటు పలువురు నాయకులు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముత్తారం : ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 81వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముత్తారం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఖనిలో నివాళులర్పిస్తున్న బొంతల రాజేష్, నాయకులు



కమాన్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాల్వశ్రీరాంపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

పెన్షన్లు పెంచేంత వరకు ఉద్యమం ఆగదు

మంథని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వికలాంగులు, వృద్ధులు, వింతులు, ఒంటరి మహిళలు, వివిధ రంగాల్లోని కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ పెంచేంత వరకు ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన మంథని నియోజకవర్గ పెన్షనర్ల సన్నాహక సభలో మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే వికలాం గులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఇతర కార్మికులకు రూ. 4 వేలు పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ తరుపు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించించారన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం దీనిపై ప్రతిపక్షనేతగా నిలదీయలేదన్నారు. ఏపీలో మాత్రంలో అక్కడి సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్నారన్నారు. సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో విశ్వరూప మహాగర్జన ఏర్పాటు చేశామన్నారు. నేతలు



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ.

ఏపూరి వెంకటేశ్వర్‌రావు మాదిగ, అంబాల రాజేందర్ మాదిగ, గోపాల్, పల్లె బాపు మాదిగ, నగిరి మల్లేశ్వరీ, మంథని చందు, నారాయణరెడ్డి, నరేష్, దశరథం, కొమురయ్య మామిడి సంపత్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు ఢిల్లీలో ధర్నా చేయాలి

కమాన్‌పూర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులకు దమ్ముంటే ఢిల్లీలో ధర్నా చేయాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తాటికొండ శంకర్, మాజీ జడ్పీటీసీ మేకల సంపత్, మండల యూత్ అధ్యక్షుడు బొమ్మగాని అనిల్ గౌడ్ మాట్లాడుతూ బీజేపీ పదేళ్ల పాలనలో మన రాష్ట్రానికి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని విమ ర్శించారు. దీనికి నిరసనగా స్థానిక బీజేపీ నేతలు ఢిల్లీలో ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. మంథని ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌గా పుట్ట మధు మండ లంలో కోట్లాది రూపాయాలతో రోడ్లు వేయించారని అన్నారు.

ఆదివరాహ స్వామి ఆలయ కమిటీకి దరఖాస్తుల స్వీకరణ

కమాన్‌పూర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహస్వామి పునరుద్ధరణ కమిటీకి చైర్మన్, డైరెక్టర్ల నియామకాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ ప్రధాన కార్యదర్శి శైలజ రామయ్యర్ తెలిపారు. ఎండోమెంట్ చట్టం ప్రకారం ఆసక్తిగల వ్యక్తులు కమిటీ సభ్యత్వం కోసం నిబంధనలలోని తెలిపిన వివరాల మేరకు 20 రోజు ల్లోగా హైదరాబాద్‌లోని దేవాదాయ డైరెక్టర్, జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లకు పంపించాలని పేర్కొన్నారు.

చీకట్లో శివాజీనగర్

కోల్‌సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శివాజీనగర్ ప్రాంతం మంగళవారం రాత్రి నుంచి చీకట్లోనే ఉంది. పోచమ్మ మైదానంలోని షాపులను తొలగించే సందర్భంలో విద్యుత్ సరఫరాను సింగరేణి సంస్థ నిలిపి వేసింది. కూల్చివేత సమయంలో ఒక విద్యుత్ స్తంభం ధ్వంసమైంది. దాన్ని పునరుద్ధరించలేదు. వర్క్ షాప్‌నకు ఫోన్‌చేస్తే స్పందించడం లేదని కాలనీవాసులు తెలిపారు.



కాలనీలోని ఓ ఇంట్లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీలో టీ2-592లో నివాసముంటున్న గడ్డం పరేష్ ఇంట్లో బుధవారం గుర్తు తెలియ ని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డం పరేష్ మధ్యాహ్నం కుటుంబ సభ్యులతో కలిసి గోదావరిఖనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి తలుపు తీసి ఉండగా వెంటనే బీరువాలో చూడగా అందులో ఉన్న రెండు గోల్డ్ చైన్స్, కమ్మలు, ఒక రింగ్ దొంగిలించినట్టు బాధితుడు తెలిపారు. వాటి వివరాలు నమోదు చేసుకుని టుటౌన్ పోలీసు లు క్లూస్ టీమ్‌తో వేలి ముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ఈ విషయంపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని టుటౌన్ పోలీసులు తెలిపారు.

కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలి

● **ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ**

గోదావరిఖని, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలపై జేబీసీసీఐ హైపవర్ కమిటీ నిర్ణయించిన ప్రకారం 2013 నుంచి వేతనాలు అమలు చేయాల్సి ఉందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ అన్నారు. బుధవారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ రాసుద్దీన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఐ కృష్ణ మాట్లాడుతూ వేతన ఒప్పందాన్ని చేసిన ఎఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సింగరేణిలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘంగా ఉన్నాయని జాతీయ సంఘాలుగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీ యూసీ, సీఐటీయూ, బీఎంఎస్‌లు కేంద్ర, రాష్ట్ర పాలకులకు అనుకూ లంగా ఉన్నా 13 ఏళ్లుగా కోల్ ఇండియాలో అమలు చేస్తున్న హెచ్‌పీసీ వేతనాలు సింగరేణిలో అమలు చేయించేందుకు ముందుకు రావాల న్నారు. కోల్ ఇండియాలో కాంట్రాక్టు కార్మికుల హై పవర్ వేతనాలు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన వేతనాలు చెల్లించాలని



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ

డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐ క్రిష్ణ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమైక్యతను పెంచేందుకు, సమస్యల పరిష్కారానికి సమైక్య పోరాటాలకు విశాల ఐక్య కార్యాచర ణకు ఐఎఫ్‌టీయూ సంసిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం, ఏ వెంకన్న, సహాయ కార్యదర్శి జే.సీతారామయ్య, నాయకులు ఈ నరేష్, బి అశోక్, కొండపల్లి శీను, ఎన్ సంజీవ్, మోత్కు రి మల్లికా ర్జున్, అంజయ్య, మల్లేష్, పద్మ పాల్గొన్నారు.

సింగరేణి పరిశ్రమల పరిరక్షణకు దీర్ఘకాలిక ఆందోళనలు

గోదావరిఖని, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త బొగ్గు పరిశ్రమ, సింగరేణి పరిశ్రమ పరిరక్షణ కార్మిక హక్కుల సంరక్షణ కొరకు దీర్ఘకాలిక ఆందోళన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్టు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్)అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అన్నారు. బుధవారం స్థానిక ఫైవింక్లైన్ చౌరస్తా కూడలిలో సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) కార్నర్ సమావేశంలో ముఖ్యఅతిథిగా యాదగిరి సత్తయ్య అధ్యక్షులు పాల్గొని మాట్లాడారు. ఆందోళనలు ప్రజా ఉద్యమాలు చేస్తూ కార్మికులను కాంట్రాక్ట్ కార్మికు లను, ప్రభావిత గ్రామాల ప్రజలను చైతన్య పరుస్తూ దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గని సింగరేణి పరిశ్రమ సమస్యలను పరిష్కారం కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినారు. దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమలలో సభ్యత్వ వెరిఫికేషన్ ఆధారంగా నడుస్తున్న పద్ధతిని సింగరేణిలో అమలు చేయాలని ప్రజాస్వామ్య పద్ధతిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. మైన్స్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ 2015 ప్రకారం వేలంపాట ద్వారా నూతన బొగ్గు గనులను సాధించుటకు రాష్ట్ర ప్రభుత్వము సింగరేణి యాజమాన్యం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియా మాదిరిగా అలవెన్స్‌లపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంటు చెల్లించాలని డిమాండ్ చేసినారు, సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం ఉండరాదని పారిశ్రామిక చట్టాల



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

వివాదం ప్రకారం కార్మిక సంఘాల ప్రాతినిధ్యం కొనసాగించుటకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసిన విద్యుతు బొగ్గు బకాయిలు రూ.39వేల కోట్లు చెల్లించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేసినారు. ఏరియా ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్, ఆకుల హరిణ్, సెంట్రల్ ట్రెజరర్, గంగిశెట్టి నరసింహులు, మేడ రాంమూర్తి, పల్లె శ్రీనివాస్, పిట్ కార్యదర్శి, తాట్ల లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఖని యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మనోహర్

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని శాతవాహన యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఇనుగాల మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు శాతవాహన యూనివర్సిటీ రిజి స్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్ నియా మక పత్రాన్ని జారీ చేశారు. గత ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రమాకాంత్ నుంచి నూతన ప్రిన్సిపల్ మనోహర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మనోహర్ శాత వాహన యూనివర్సిటీలోని బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రమాకాంత్, డాక్టర్ ఎస్.వి రంగప్ర సాద్, డాక్టర్ రవి, డాక్టర్ ప్రసాద్, శ్యాంకుమార్, డాక్టర్ సుధ, రమ్య, శ్రీనివాస్, రవీందర్, శంకర్, కమలాకర్, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.